క్లుప్తంగా

వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు



పామర్రు: వైశాఖ మాసం శుద్ధ చతుర్దశి పురస్కరించుకుని మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివార్లను పెళ్లికుమారుడిగా అమ్మవార్లను పెళ్లికుమార్తెలుగా గురువారం అలంకరించారు. పామర్రులోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. పెదమద్దాలి, జమీగొల్వేపల్లి తదితర గ్రామాల్లో పంచామృత అభిషేకాలను నిర్వహించారు. ఆలయంలో పూజలను ఆర్‌కేవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ మేనేజర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎన్‌ప్రసాద్, ఆర్.రంగప్రసాద్, కె.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా గురువారం రాత్రి నిర్వహించారు. యాజ్ఞీక స్వామి రొంపిచర్ల పవన్‌కుమార్ ఆధ్వర్యాన కల్యాణ మహోత్సవం జరిగింది. మహేష్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని జరిపించారు.

ఘనంగా నృసింహ జయంతి



జుఝువరం(పామర్రు): జుఝువరంలో స్వయంభుగా వెలసిన శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గురువారం నృసింహ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు రొంపిచర్ల సాయి, ఆర్.ధనవెంకట సత్యనారాయణ, అరవిందకుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓ దుర్గా ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



మండవల్లి: మండలంలోని లింగాల గ్రామంలో కొలువుదీరిన శ్రీ గంగా విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాల్లో గురువారం ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ రాజులపాటి యశోధనరావు, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కమదన శేషతల్పారావు(నాయనబాబు), ఖాదర్ బాషా, జంగం రామదాసు, అనిసెట్టి రామకృష్ణ, పెడసనకంటి కనకాచారి, నాగరాజు, మరాలా జగన్నాథం, గుమ్మడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత



కొండిపర్రు(పామర్రు): ఇటీవల మరణించిన కొండిపర్రు సర్పంచ్ మట్టా వినయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం మంజూరైందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మృతుని కుటుంబానికి గురువారం రూ.10 వేలు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా కింద మృతుని కుటుంబానికి రూ.లక్ష మంజూరైందన్నారు. ప్రస్తుతం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలను మృతుని కుటుంబసభ్యులకు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ తలారి మహేష్, నాయకులు రాజారెడ్డి, వెంకటరమణ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వినోద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి

పెదమద్దాలి(పామర్రు): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ సూర్యనారాయణ ఆదేశించారు. పెదమద్దాలి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పంట బోదె పూడికతీత పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలన్నారు. కూలీల హాజరు సమయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. పనిలోకి వచ్చిన వారికి మాత్రమే హాజరు వేయాలని, దీనికి వ్యతిరేకంగా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవి దృష్ట్యా కూలీల తాగునీటికి, నీడ ఏర్పాటుకు నగదు చెల్లిస్తున్నామన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

గ్రామంలో జరుగుతున్న జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. గ్రామంలో 56 మంది గృహ లబ్ధిదారులు ఉండగా వీరిలో 10 మంది మాత్రమే నిర్మిస్తున్నామన్నారు. మిగిలిన వారు కూడా త్వరగా మొదలుపెట్టాలన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, తాగునీరు, రహదార్లను త్వరిత గతిన కాలనీల్లో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యద్దనపూడి రామకృష్ణ, ఏపీఓ పాలు రాజు, ఐకేపీ ఏపీఎం తిరుమలరావు, హౌసింగ్ డీఈఈ నిరీక్షణరావు, ఇన్‌చార్జి ఏఈ పవన్‌కల్యాణ్, గ్రామ కార్యదర్శి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెదమద్దాలి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ సూర్యనారాయణ

మండవల్లి: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి.మల్లీశ్వరి ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు, వీఏఓలు, మహిళా పోలీసులకు గురువారం సమావేశం జరిగింది. ఆయా గ్రామాల్లో జగనన్న కాలనీలను పర్యవేక్షించి పరిస్థితిని సమీక్షించి వేగంగా నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గన్నవరం, మొఖాసాకలవపూడి గ్రామాల్లో ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు గురువారం చెత్త నుంచి సంపద కేంద్రాలు పరిశీలించారు. గన్నవరంలో సర్పంచ్ గుడివాడ శ్రీదేవిని, కార్యదర్శి దయామణిని కలిసి సంపద కేంద్రం నుంచి ఎక్కువ మోతాదులో మెటీరియల్ వచ్చేలాచర్యలు తీసుకోవాలని సూచించారు.

సంఘ సంక్షేమానికి కృషి

ముదినేపల్లి రూరల్: ఎంపీపీల సంఘ సంక్షేమానికి విశేషంగా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణకు సూచించారు. ఎంపీపీల రాష్ట్ర కార్యవర్గ సంఘ సభ్యుడిగా స్థానిక ఎంపీపీ రామిశెట్టి ఎంపికకావడంతో గురువారం ముదినేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘానికి సరైన సూచనలు, సలహాలు అందిస్తూ ముదినేపల్లి మండలానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఎంపీపీని శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, గంటా కోటేశ్వరరావు, తాడంకి రాజేష్, రాచూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ రామిశెట్టిని అభినందిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు

మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ

గుడివాడరూరల్: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని 25, 26, 28, 29వ వార్డు సచివాలయాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పేదలందరికీ అందజేయడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలుత సంక్షేమ పథకాల రికార్డులను, పర్సనల్, సెలవుల రిజిస్టర్లను, మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేసి సచివాలయ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఉద్యోగుల రికార్డుల నిర్వహణ, సమయ పాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఉండాలని, స్పందన, జగనన్నకి చెబుదాం కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెదపారుపూడి: అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఎంపీపీ గోగం సురేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం. నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వెల్ఫేర్ అసిస్టెంట్స్ వివరించాలని చెప్పారు. వలంటీర్లు కూడా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గతంలో ఏ ప్రభుత్వం చెయ్యని విధంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించడంతో చరిత్రలో ఎక్కారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వేమూరి మోహన్, రావులపాడు సర్పంచ్ గోళ్ల సోమేశ్వరరావు, పార్టీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ దొండపాటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నేత డి. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సురేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగిరెడ్డి

కమనీయం.. మీసాల వెంకన్న కల్యాణోత్సవం



కైకలూరు: మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కైకలూరు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవంలో గురువారం స్వామివారి దివ్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్యహోమం, బలిహరణ చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొప్పన శివకుమార్, ఆలయ ఈవో వివిఎన్‌కే.శేఖర్‌లు స్వామివారి కల్యాణ ఏర్పాట్లును పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, మురళీకృష్ణ, రాంబాబు తదితరులు హాజరయ్యారు. కోరుకొల్లు శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వరస్వామి వార్షిక కల్యాణం వైభవంగా జరిగింది. దేవస్థాన చైర్మన్ చెన్నంశెట్టి శ్రీనివాసరావు, ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయంలో కలిదిండి అమ్మ హాస్పటల్ డాక్టరు దీప్తి ఊయలను వితరణగా అందించారు.

లక్ష్మీనృసింహునికి లక్ష తులసిపూజ

కైకలూరు: ఓం నమో లక్ష్మీనారసింహ నామస్మరణతో వరహాపట్నం శ్రీ భూ సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం మార్మోగింది. నృసింహ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బృందవనం ధన్వంతరీచార్యులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, రక్షాబంధనపూజ లక్ష తులసీపూజను చేశారు. అనంతరం సుదర్శన సహిత శ్రీనృసింహ యాగం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కైకలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. కొట్టాడ పంచాయతీ పరిధి రాజుల కొట్టాడలో జలజీవన్ మిషన్ నిధులు రూ.9.28 లక్షలతో చేయనున్న పైపులైన్ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కృషి చేస్తున్నారని చెప్పారు. నూతన పైపులైను ఏర్పాటుతో రాజుల కొట్టాడలో 220 కుటుంబాలకు తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచ్ కొల్లాటి పద్మావతి, ఎంపీటీసీ సిద్దబట్టిన సువర్ణ, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, పంచాయతీ ఈఓ డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాజుల కొట్టాడలో తాగునీటి పైపులైనుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ

పాడి రైతులకు బోనస్ పంపిణీ

మొవ్వ: స్థానిక పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘంలో గురువారం 150 మంది పాడి రైతులకు బోనస్‌గా రూ3,10,000 పామర్రు పాల శీతలీకరణ కేంద్రం మేనేజరు చిట్టూరి దామోదర కృష్ణ గోపి అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షులు మండవ కోటేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబర్ 2022 నుంచి ఈ ఏడాది మార్చి 2023 మధ్య కాలానికి బోనస్ అందించినట్లు వెల్లడించారు. అత్యధికంగా పాలు పోసిన పాడి రైతు చలసాని విజయ భాస్కర్‌కు రూ18,263 అందించామన్నారు. మేనేజర్ కృష్ణ గోపి మాట్లాడుతూ పామర్రు పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని 9000 మంది పాడి రైతులకు రూ2.20 కోట్లను బోనస్ రూపంలో అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాడి రైతులు మండవ వెంకట రావు, వేములపల్లి సుధాకర్, వీర్ల పూర్ణ, కోగంటి సుబ్బారావు, ఎం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బోనస్‌ను పాడిరైతులకు అందజేస్తున్న మేనేజర్ కృష్ణగోపి

ఘనంగా లూర్దుమాత మహోత్సవాలు

మండవల్లి: భైరవపట్నంలో లూర్దు మాత మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరించి తరించాలని సూచించారు. లూర్దు మాత కరుణా, కటాక్షాలు అందరిపై ప్రసరించాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), చదలవాడ శేషగిరిరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, బుంగా రాణి, విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు, ఎంపీటీసీ నాగదాసి కిరీటిరాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, మెండా సురేష్, పాల్గొన్నారు.



లూర్దుమాత మహోత్సవాల ముగింపులో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

పూర్వ విద్యార్థుల పాత్ర కీలకం

కైకలూరు: కళాశాల గ్రేడ్ గుర్తింపులో పూర్వ విద్యార్థుల పాత్ర కీలకమని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రఘునాథరెడ్డి అన్నారు. కాలేజీలో జూన్ 21, 22 తేదీల్లో నాక్ కమిటీ కళాశాలను సందర్శించి గ్రేడ్ నిర్ణయించే నేపథ్యంలో గురువారం పూర్వ విద్యార్థుల కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు బొర్రా శ్యామ్‌సుందర్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమష్టి కృషితోనే కాలేజీ గుర్తింపు సాధ్యమని, నాక్ కమిటీ సందర్శనలో అవలంబించాల్సిన విధివిధానాలను అందరూ అవగాహన చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలు, సహకారం అందించాలన్నారు. మండవల్లి మండలం పులపర్రు గ్రామానికి చెందిన చంద్రాల బాలాజీ రూ.1,60,000 ఆర్థిక సాయాన్ని కళాశాల అభివృద్ధికి కేటాయించడం అభినందనీయమన్నారు. అధ్యాపకుల్లో 23 మంది పీహెచ్‌డీలు పూర్తి చేసి, నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అడ్మిషన్లు మరింత పెరగడానికి అందరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ కోరారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి ఏటా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించాలని సమావేశంలో నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల్లో పలువురు సాయం ప్రకటించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి చిట్టూరి చంద్రశేఖర్, కో-ఆర్డినేటర్ సున్న శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు సముద్రుడు, రామాంజనేయులు, మద్దురి ప్రసాద్, సంబూరి రామరాజు, అధ్యాపకులు ఇమ్మానియేలు, ఎస్వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్టాండింగ్‌క్రాప్ ఎన్యుమరేషన్ చేయాలి

పామర్రు(తోట్లవల్లూరు): మండలంలో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న స్టాండింగ్ క్రాప్(పంట కొయ్య)కు ఎన్యుమరేషన్ చెయ్యాలని గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించామని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వో, వీఏఏలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో మొక్కజొన్న, జొన్న, వరి, అరటి, పసుపు తదితర పంటలు కోయకుండా ఎన్యూమరేషన్ చేయడానికి 16 బృందాలను ఏర్పాటుచేశామని చెప్పారు. ఈ టీములు శుక్రవారం నుంచి ఐదురోజుల పాటు మండలంలో పర్యటిస్తూ దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాయని చెప్పారు. అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నాగేశ్వరరావు, ఏఈవో లక్ష్మణరావు, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శివయ్య

రేపు నృత్య ప్రదర్శనలు

గుడివాడరూరల్: కళాజ్యోతి సమ్మేళనం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నిర్వహించనున్న క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శలను విజయవంతం చేయాలని ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సరితనెహ్రూ పేర్కొన్నారు. గుడివాడలోని ఆమె స్వగృహంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 6న గుడివాడ అలంకృత ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 6 నుంచి రాత్రి 9గంటల వరకు క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ నుంచి 200మంది కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బంగారు నేత్రాల వితరణ

ముదినేపల్లి రూరల్: అల్లూరు శ్రీపార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమ్మవారికి బంగారు నేత్రాలను దాతలు బహూకరించారు. దివ్య కల్యాణ మహోత్సవాలు వేదపండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గెల్లి ప్రసాద్ దంపతులు పార్వతీదేవికి రూ.50 వేల విలువ చేసే 7 గ్రాముల బంగారు నేత్రాలను ఆలయ చైర్మన్ గులిపల్లి సుధారాణి, శ్రీనివాస్ దంపతులకు అందజేశారు. ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, ప్రధాన అర్చకుడు ఐలూరు సుబ్రహ్మణ్యం, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో బంగారు నేత్రాలు అందజేస్తున్న దాతలు

సుబ్బారాయుడికి విరాళం

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి దాతలు గురువారం విరాళమందించారు. బంటుమిల్లి మండలం జయపురం గ్రామానికి చెందిన అబ్బూరి శివ పూర్ణపరమేశ్వరరావు, తులసీ దంపతులు అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం రూ.10,116 విరాళాన్ని స్వామిసన్నిధిలో ఆలయ అర్చకుడు తోలేటి శివశంకరశర్మకు అందజేశారు.



స్వామిసన్నిధిలో అర్చకుడికి విరాళమందిస్తున్న దాతలు

ఘనంగా జగజ్యోతి

ఎలకుర్రు(పామర్రు): ఎలకర్రులోని శ్రీ భ్రమరాంబ సమేత చెన్న మల్లికార్జున స్వామి ఆలయంలోని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం జగజ్యోతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత వేదపారాయణ పఠనం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో జగజ్యోతిని ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటలకు గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, సుయోధన మయసభ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన సంరక్షణపై ర్యాలీ

మండవల్లి: గుడివాడ గెయిల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం మండవల్లిలో ఇంధన సంరక్షణ క్షమ పక్షోత్సవం-2023 సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ జరిగింది. అనంతరం ద్విచక్ర వాహన కాలుష్య ఉచిత తనిఖీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ పరి మితంగా లభించే ఇంధనాన్ని పొదుపు చేస్తే భవిష్యత్ తరాల ఇంధన అవసరాలు తీర్చడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. గెయి ల్ అధికారులు బాలకృష్ణయ్య, కృష్ణమాచార్యు లు, శివప్రసాద్, కుమారస్వామి పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే ఇండియన్ బ్యాంక్ రుణాలు

మండవల్లి : బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. ఇండియన్ బ్యాంక్ శాఖలో గురువారం వ్యవసాయ రుణాల పండుగను నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ 30 వరకు వ్యవసాయ రుణాల పండగ సందర్భంగా అత్యల్ప వడ్డీ రేటు 71 పైసలు అని రూ. 3 లక్షల వరకు ప్రాసెసింగ్ ఫీజు తీసుకోవడం లేదని, రూ. 4 లక్షల వరకు భూమి రికార్డులు అవసరం లేకుండానే రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఏబీఎం పద్మకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, బంగారం మదింపుదారుడు అమర్నాథ్ పాల్గొన్నారు.